Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

గురువారం
5 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 119
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar



## ప్రజల్లోకి వెళ్లడంపై వ్యూహ రచన


### 11న బీఆర్ఎస్ శ్రేణులతో కేసీఆర్ భేటీ

**శుభ తెలంగాణ హైదరాబాద్**

రైతుల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని భావిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేలా కార్యాచరణ అమలు చేసేందుకు గులాబీ బాస్ వ్యూహరచన చేస్తున్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఈనెల 11న తెలంగాణ - మిగతా3లో

# హైడ్రాకు హైపవర్

- హైకోర్టు నియమించిన కమిటీ తన
- నివేదికలో గోపన్‌పల్లిలోని గోసానికుంట
- చెరువు గురించి పేర్కొన్న అంశాలు..
- ఆక్రమణల తొలగింపునకు సర్వాధికారాలు
- నోటీసులు కూడా జారీ చేసేలా..
- రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ,
- పంచాయతీరాజ్‌కు పురపాలక శాఖ లేఖ
- చట్టంలో మార్పులా?.. అధికారాల బదలాయింపా?
- న్యాయ సలహా కోరిన రెవెన్యూ అధికారులు
- హెచ్ఎండీఏలోని 3532 చెరువులు హైడ్రా కిందికే!



**శుభ తెలంగాణ హైదరాబాద్**

చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రాకు మరిన్ని అధికారాలను కట్టబెట్టే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. అక్రమ కట్టడాల తొలగింపునకు ఇప్పటివరకు వివిధ శాఖల పరిధిలో ఉన్న అధికారాలన్నింటినీ హైడ్రా పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖ.. ఇలా సంబంధిత శాఖలన్నింటి నుంచి హైడ్రా విధి నిర్వహణకు అవసరమైన అధికారాలను ఆ సంస్థకు బదలాయించనున్నారు. ఉదాహరణకు.. ఇటీవల దుర్గం చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భవనాల తొలగింపునకు సంబంధించి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే ఇక నుంచి నోటీసులిచ్చే అధికారాన్ని కూడా రెవెన్యూ నుంచి హైడ్రాకు బదలాయించనున్నారు. కాగా, జీహెచ్ఎంసీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉండే అధికారాలనూ హైడ్రాకు బదలాయించాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఆ శాఖలను కోరినట్లు విశ్వసనీయంగా - మిగతా3లో



## ఏపీ, తెలంగాణలకు సోనూసూద్ సాయం

- మంచినీరు, ఆహారం, మెడికల్ కిట్స్, తాత్కాలిక షెడ్స్ ఏర్పాటు చేసేందుకు కృషి
- తెలుగు రాష్ట్రాలు వరదలతో యుద్ధం చేస్తున్నాయని ఎక్స్ వేదికగా సోనూ సూద్ ట్వీట్
- తన చారిటీ ద్వారా నిధులు సమకూర్చే ప్రయత్నం

### సీఎం రేవంత్‌కు వ్యంగ్యం తప్ప..

## పరిపాలన వ్యవహారం లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షాల మీద దాడులు, కక్ష సాధింపులకు పాల్పడుతుంది
- హామీల అమలు లేదు.. పరిపాలనపై పట్టింపులేదు
- అరచేతిలో వైకుంఠం చూపించి.. అధికారంలోకి రాగానే పాలనను కాంగ్రెస్ ఆగం చేస్తుంది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



**శుభ తెలంగాణ సిద్దిపేట**

ముఖ్యమంత్రి రేవంత్ వద్ద వ్యంగం తప్ప పరిపాలన వ్యవహారం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. సిద్దిపేటను ఓర్వలేక ఇక్కడి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని.. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షాల మీద దాడులు, కక్ష సాధింపులకు పాల్పడుతుందని.. హామీల అమలు లేదు.. పరిపాలనపై పట్టింపులేదని మండిపడ్డారు. అరచేతిలో వైకుంఠం చూపించి.. అధికారంలోకి రాగానే పాలనను కాంగ్రెస్ ఆగం చేస్తుందని విమర్శించారు. %ఆపదలో పార్టీ పక్షాన ఆదుకునేందుకు - మిగతా3లో



## తెలంగాణలో రేవంత్ రెడ్డి చేసేది కరెక్ట్

- హైడ్రాపై పవన్ కల్యాణ్ ప్రశంసలు
- హైడ్రా లాంటి వ్యవస్థ మంచిదే
- వరద రావడం లేదనే ఉద్దేశంతో తెలంగాణలోనే కాక ఏపీలో కూడా ఎంతో మంది పరివాహక ప్రాంతాలను ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నారు
- ఎంతో మంది వ్యక్తులు ఎన్నో ఏళ్లుగా ఇలా ఆక్రమణలకు పాల్పడడం వల్లే ప్రస్తుతం వరదలు వస్తున్నాయి

## హైడ్రా పేరు చెప్పి లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవు

- హైడ్రా పేరుతో డబ్బులు వసూలు చేస్తే సమాచారం ఇవ్వండి: ఏసీబీ
- పాత నోటీసులు చూపించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు
- పలుచోట్ల బాధితులు ఫిర్యాదులు చేశారన్న ఏసీబీ
- డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచన

# పవర్ లూం క్లస్టర్‌ను మంజూరు చేయండి

- యార్న్ డిపోను ఏర్పాటు చేయండి..
- సబ్సిడీని 80 శాతానికి పెంచండి
- పావులా వడ్డీకే రుణాలందించండి
- కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కలిసిన బండి సంజయ్..



**శుభ తెలంగాణ హైదరాబాద్**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను కోరారు. దీంతోపాటు నేషనల్ హ్యాండ్లూం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు డిపో యార్న్ డిపో, ను ఏర్పాటు చేయాలని విజ&ఝప్తి చేశారు. అట్లాగే ముడిసరుకు ఖర్చుల కారణంగా నేతన్నలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న - మిగతా3లో

## 'బుల్డోజర్' నడపాలంటే దమ్ముండాలి



- అల్లరి మూకలకు వత్తాసు పలికేవారు బుల్డోజర్ ముందు నిలవలేరు
- అఖిలేష్‌కు యూపీ సీఎం కౌంటర్
- బుల్డోజర్లకు మెదడు అవసరం లేదు, స్టీరింగ్ ఉంటే చాలు
- బుల్డోజర్‌ను హ్యాండిల్ చేసే ప్రతిఒక్కరికీ ఆ సామర్థ్యం, సత్తా ఉండవు
- బుల్డోజర్‌ను నిర్వహించాలంటే హృదయం, మనసు రెండూ అవసరమని స్పష్టం

# 'బుల్డోజర్' నడపాలంటే దమ్ముండాలి




**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో బుల్డోజర్ల వివాదం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. తొలుత ఈ మాటల యుద్ధానికి అఖిలేష్ తెరతీయగా, దేనికైనా దమ్ముండాలంటూ యోగి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

**అఖిలేష్ వెర్సస్ యోగి**

సమాజ్ వాదీ పార్టీ 2017లో అధికారంలోకి వస్తే అన్ని బుల్డోజర్లను గోరఖ్‌పూర్ వైపు నడిపిస్తామని అఖిలేష్ యాదవ్ మంగళవారంనాడు జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యానించారు. యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్ కావడంతో ఈ వ్యాఖ్యలు సంచలనమయ్యాయి. అఖిలేష్ హెచ్చరికలను యోగి ఆదిత్యనాథ్ బుధవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో తిప్పికొట్టారు. బుల్డోజర్ నడపడానికి ధైర్యం, తెలివితేటలు, దృఢ సంకల్పం ఉండాలని, ఆ లక్షణాలేవీ యాదవ్‌లో లేవని అన్నారు. "అందరి చేతులు బుల్డోజర్ నడపడానికి పనికి రావు. దానికి ధైర్యం, తెలివితేటలు (దిల్, దిమాగ్) ఉండాలి. సమర్థత, దృఢ సంకల్పం ఉన్నవాళ్లే బుల్డోజర్ నడపగలరు. అల్లర్లు సృష్టించేవారి ముందు మోకరిల్లేవారు బుల్డోజర్ ముందు నిలవలేరు" అని కౌంటర్ ఇచ్చారు.

**సుల్తాన్ కావాలనుకుంటున్న టిప్పు**

అఖిలేష్ యాదవ్‌ను 'టిప్పు' అనే నిక్‌నేమ్‌తో యోగి సంబోధిస్తూ, టిప్పు ఇప్పుడు సుల్తాన్ కావాలని ప్రయత్నిస్తున్నారంటూ చురకలు వేశారు. 2017లో బీజేపీ అధికారంలోకి రాకముందు యూపీలో 'ఆటవికపాలన' ఉండేదన్నారు. అఖిలేష్ యాదవ్, ఆయన అంకుల్ శివపాల్ యాదవ్‌లు బలవంతపు వసూళ్లు చేసేవారని, ఏరియాలు పంచుకుని మనీ లూటీలకు పోటీ పడేవారని ఎద్దేవా చేశారు. బుల్డోజర్ స్టీరింగ్‌ను యూపీ ప్రజలు మార్చేస్తారని యోగిపై విరుచుకుపడ్డారు. అయితే అఖిలేష్ వ్యాఖ్యలకు యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ దీటుగా బదులిచ్చారు. బుల్డోజర్‌ను హ్యాండిల్ చేసే ప్రతిఒక్కరికీ ఆ సామర్థ్యం, సత్తా ఉండవని వ్యాఖ్యానించారు. బుల్డోజర్‌ను నిర్వహించాలంటే హృదయం, మనసు రెండూ అవసరమని స్పష్టం చేశారు. దమ్ము, అంకితభావం కలిగిన వారే ఇలాంటి టాస్క్‌లను నెగ్గుకురాగలరని పేర్కొన్నారు.

ఇవాళ వీరు సరికొత్త రూపంలో ప్రజలను తప్పుదారిపట్టించేందుకు వస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరి చేతులు బుల్డోజర్‌కు ఫిట్ కావని చెప్పుకొచ్చారు. అల్లరి మూకల ముందు సాగిలపడే వారు బుల్డోజర్ ముందు నిలవలేరని ఎద్దేవా చేశారు. సుల్తాన్ కావాలనే వారి కలలు ఫలించబోవని అఖిలేష్ పేరును పరోక్షంగా ప్రస్తావిస్తూ యోగి పేర్కొన్నారు. ఎస్పీ హయాంలో అఖిలేష్ యాదవ్, శివపాల్ యాదవ్ దోపిడీ యదేచ్ఛగా సాగిందని ఆరోపించారు. వాటాల కోసం ఊర్లను పంచుకున్నారని, మనుషులను తినే తోడేళ్ల వలే 2017కు ముందు పాలన సాగిందని యోగి ఆదిత్యానాథ్ దుయ్యబట్టారు.

# వయనాడ్ బాధితులకు నెల జీతాన్ని విరాళంగా ఇచ్చిన రాహుల్ గాంధీ




కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పెద్ద మనసు చాటుకున్నారు. ఇటీవలే కుంభవృష్టితో తీవ్రంగా దెబ్బతిన్న కేరళలోని వయనాడ్ కోసం విరాళం ప్రకటించారు. తన ఒక నెల జీతం రూ.2.3 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. వయనాడ్‌లో పునరావాసం కోసం కార్యక్రమాలు చేపడుతున్న కేరళప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి (కేపీసీసీ) ఈ సాయాన్ని అందజేశారు. "వయనాడ్‌లోని మా సోదర, సోదరీమణులు వినాశకరమైన విషాదాన్ని చవిచూశారు. వారు ఎదుర్కొన్న ఈ నష్టాల నుంచి కోలుకునేందుకు మన మద్దతు అవసరం. అందుకే బాధితుల సహాయార్థం, పునరావాస ప్రయత్నాలకు నా వంతు సాయంగా నెల మొత్తం జీతాన్ని విరాళంగా ఇచ్చాను' అని రాహుల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ప్రకృతి విపత్తులో సర్వం కోల్పోయిన బాధితుల కోసం ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ విరాళాలు సేకరిస్తున్న విషయం తెలిసిందే. విరాళాల సేకరణ కోసం ప్రత్యేకంగా 'స్టాండ్ విత్ వయనాడ్ - ఐఎన్‌సీ' అనే యాప్‌ను రూపొందించింది. వయనాడ్‌లో పునరావాస పనులకు సంబంధించిన పురోగతిని కాంగ్రెస్ ఎంపీ కే సుధాకరన్ స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం లిజు తెలిపారు. కాగా, జూలై నెల చివర్లో భారీ వర్షాలు వయనాడ్‌ను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. ఈ వర్షాలకు మెరుపు వరదలు సంభవించాయి. దీంతో వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రకృతి విపత్తులో గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకుపోయాయి. ఈ విలయంలో సుమారు 400 మంది వరకూ ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ అన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో ఆ ప్రాంతాన్ని పునర్నిర్మించేందుకు కేరళ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో కేరళ సర్కార్‌కు పలువురు ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఇక వయనాడ్‌లో బాధితులకు కాంగ్రెస్ పార్టీ కూడా 100 ఇళ్లు నిర్మించాలని తలపెట్టింది. ఇందుకోసం పార్టీ విరాళాలు సేకరిస్తోంది. దీనికి రాహుల్ కూడా తన వంతు సాయం అందించారు.

# లివింగ్ రిలేషన్ షిప్... గర్భం వస్తే నాకు సంబంధం లేదు

**నెట్టింట్లో వైరల్ అవుతున్న కండిషన్స్**



**ముంబై :** పెళ్లి పేరుతో తనను మోసం చేయడమే కాకుండా.. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఓ ప్రభుత్వ ఉద్యోగిపై యువతి కేసు పెట్టింది. దీంతో ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు ప్రారంభించిన నిందితుడు.. అందుకు లాయర్‌ను సంప్రదించాడు. తాను ఆమెను మోసం చేయలేదని, ఇద్దరం లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నామని వివరించాడు. అంతేకాదు, సహజీవనం కోసం తమ మధ్య కుదిరిన ఒప్పందం బయటపెట్టిన అతడు... అందులోని ఒక కండిషన్ ప్రకారం తనపై కేసు చెల్లదని పేర్కొనడం గమనార్హం. కానీ, ఆ ఒప్పంద పత్రంపై తాను సంతకం చేయలేదని, అది ఫోర్జరీ చేశాడని సదరు యువతి వాదిస్తోంది. దీంతో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటన దేశ ఆర్థిక రాజధాని నగరం ముంబయిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వయోధికులకు సంరక్షకురాలిగా పనిచేస్తోన్న 29 ఏళ్ల యువతి..ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తోన్న 46 ఏళ్ల వ్యక్తితో సహజీవనంలో ఉంది. తనను పెళ్లి చేసుకుంటానని అతడు మోసం చేశాడని, పలుమార్లు అత్యాచారం చేశాడంటూ ఆమె ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతడిపై అత్యాచారం, మోసం తదితర సెక్షన్ల కింద కేసు నమోదయ్యింది. అయితే, నిందితుడు తమ మధ్య కుదిరిన ఒప్పంద పత్రాన్ని బయటపెట్టాడు. అంతేకాదు, తన తరఫున లాయర్‌ను కూడా పెట్టుకున్నాడు. ఇద్దరూ ఓ అవగాహనకు వచ్చిన ఒప్పందం కుదుర్చుకున్నారు కాబట్టి ఈ కేసు కుట్రపూరితమని అతడి తరఫున లాయర్ వాదించారు. కానీ, ఆ సంతకం తనది కాదని ఆ యువతి వాదించడం గమనార్హం.లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో కుదుర్చుకున్న ఈ ఒప్పందంలో ఏడు కండిషన్లు పెట్టుకున్నారు. ఆ అగ్రిమెంట్ నిబంధన ప్రకారం.. 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూన్ 30 వరకు కలిసుండాలని నిర్ణయించుకున్నారు. అలాగే, రిలేషన్‌లో ఉన్నప్పుడు పరస్పరం లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం, కేసులు పెట్టుకోవడం చేయరాదు. మూడో పాయింట్‌గా సహజీవనంలో భాగంగా అతడి ఇంట్లోనే ఆమె ఉండాలి. భాగస్వాముల్లో అవతలి వ్యక్తి వైఖరి నచ్చకపోతే నెల రోజులు ముందు నోటీసు పీరియడ్ ఇచ్చి తర్వాత విడిపోవచ్చు. ఒకవేళ, ఆమె గర్భం దాల్చితే అందుకు తాను బాధ్యుడు కాదని మరో పాయింట్లో రాసుకున్నారు. అలాగే, ఇరువురి తరఫు బంధువుల రాకపోకలపై ఆంక్షలు, మానసిక ప్రశాంతత భంగం వాటిల్లకుండా చూసుకోవడం వంటివి అగ్రిమెంట్‌లో చేర్చారు. దీని నోటరీ కూడా చేయించడం గమనార్హం. ప్రస్తుతం ఈ అగ్రిమెంట్‌పై నెట్టింట చర్చ మొదలైంది.ఈ కేసులో నిందితుడికి ట్రయల్ కోర్టు ముందస్త బెయిల్‌ను మంజూరు చేసింది. అలాగే, ఒప్పందంలోని వాస్తవాలను నిర్ధారించాలని, బాధితురాలు ఆరోపిస్తున్నట్టు ఆమె సంతకమేనా? కాదా? అనేది తేల్చాలని పోలీసీ?లకు ఆదేశాలు జారీచేసింది. విచారణ పూర్తిచేసిన తర్వాత పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అంత వరకు నిందితుడిపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని తెలిపారు.

## రాజీవ్ కంటే రాహుల్ గాంధే మెరుగైన వ్యూహకర్త




లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన తండ్రి రాజీవ్ గాంధీ కంటే మెరుగైన వ్యూహకర్త అని.. ఆలోచనాపరుడని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా అన్నారు. రాహుల్‌కు కాబోయే ప్రధానికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అగ్రనేత త్వరలో అమెరికాలో పర్యటించనున్న తెలిసిందే. పర్యటనపై బీజేపీ చేసిన విమర్శలు పిట్రోడా విమర్శలు గుప్పించారు. రాహుల్ వ్యక్తిగత స్థాయిలో కాపిటల్ హిల్ వద్ద కొంతమంది వ్యక్తులతో మాట్లాడుతారని.. జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలోనూ విద్యార్థులను కలుస్తారన్నారు. రాజీవ్ గాంధీ, పీవీ నరసింహరావు, మన్మోహన్ సింగ్, పీవీ సింగ్, చంద్రశేఖర్, హెచ్‌పీ దేవెగౌడ వంటి పలువురు ప్రధానులతో తాను కలిసి పని చేశానన్న ఆయన.. రాహుల్, రాజీవ్ మధ్య వ్యత్యాసం గురించి చెబుతూ.. రాహుల్ మేధావి, ఆలోచనాపరుడని చెప్పారు. రాజీవ్ కొంచెం ఎక్కువగా పని చేసేవాడన్నారు. ఇద్దరి డీఎన్ఏ ఒకటేనని.. ఆందోళనలు ఒకటేనన్నారు. రాహుల్ మెరుగైన భారత్‌ను నిర్మించాలని భావిస్తున్నాడని.. అతనికి వ్యక్తిగత అవసరాలు కూడా ఏమీ లేవన్నారు. రాజీవ్ కంటే రాహుల్ మంచి వ్యూహకర్త అని పేర్కొన్నారు. వారికి వేర్వేరు సమయాలు, విభిన్న సాధనాలు, విభిన్న అనుభవాలు ఉన్నాయని.. రాహుల్ జీవితంలో రెండు భారీ ఎదురుదెబ్బలను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. మొదటి అమ్మమ్మ మరణం, రెండోది ఆయన తండ్రి మరణమన్నారు. రాహుల్ ఇమేజ్ పెరుగుతోందని.. భారత్ జోడో యాత్ర ఎంతో ఉపకరించిందన్నారు. ఆయన పరువు తీసేందుకు లక్షల డాలర్లు వెచ్చించారని విమర్శించారు. రాహుల్ గాంధీకి చాలాకాలం పోరాడుతున్నారని.. మరొకరయితే బ్రతికేవారు కాదన్నారు. ప్రజలకు ఎప్పుడూ అబద్ధాలు చెప్పలేరన్నారు. రాహుల్ ప్రధాని పదవికి సమర్థుడని తాను భావిస్తున్నానని.. నాగరికత తెలిసిన వ్యక్తి అని.. కాబోయే ప్రధానికి ఉండాల్సిన అన్ని లక్షణాలు ఉన్నాయన్నారు.

## ఏపీ, తెలంగాణలకు సోనూసూద్ సాయం



భారీ వర్షాలు, వరదలతో ఉభయ తెలుగు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. వరదల కారణంగా భారీ ఆర్థిక నష్టం సంభవించింది. ఎంతోమంది వరదల్లో చిక్కుకుపోయారు. వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడటం కోసం, వారికి నిత్యావసరాలు అందించేందుకు ప్రముఖులు పెద్ద ఎత్తున విరాళాలు ప్రకటిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ నటుడు సోనూసూద్ తెలుగు రాష్ట్రాలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మంచినీరు, ఆహారం, మెడికల్ కిట్స్ అందివ్వడంతో పాటు తాత్కాలిక షెడ్స్ ఏర్పాటు చేసేందుకు తన బృందం కృషి చేస్తుందన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు వర్షాలు, వరదలతో యుద్ధం చేస్తున్నాయని, ఇలాంటి అవసరమైన సమయంలో వారికి అండగా ఉంటామని సోనూసూద్ పేర్కొన్నారు. ప్రజలు తమ తమ సహాయ అభ్యర్థనలను పంపించేందుకు సోనూసూద్‌కు చెందిన చారిటీ ఫౌండేషన్ ఈ-మెయిల్‌ను ఇచ్చారు. తద్వారా ఆయన సహాయం చేయడంతో పాటు తన చారిటీ ద్వారా వనరులను సమకూర్చే ప్రయత్నం చేస్తున్నారు.

## పార్టీ ఫిరాయించే ఎమ్మెల్యేలకు పెన్షన్ కట్.. సర్కార్ సంచలన నిర్ణయం



**సిమ్లా:** పార్టీ ఫిరాయింపులపై హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడే ఎమ్మెల్యేలకు పెన్షన్ సదుపాయాన్ని నిలిపి వేయనుంది. ఫిరాయింపు నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలకు ఈ నిబంధన వర్తిస్తుంది. ఇందుకు సంబంధించిన బిల్లుపై చర్చ అనంతరం రాష్ట్ర అసెంబ్లీ బుధవారంనాడు ఆమోదించింది. హిమచల్ ప్రదేశ్ శాసనసభ (సభ్యుల పెన్షన్లు, అలవెన్సులు) సవరణ బిల్లు-2024ను హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఏదైనా ఒక సమయంలో అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలకు ఇక నుంచి పెన్షన్ పొందే వీలుండదని బిల్లులో పేర్కొన్నారు. ఈ బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. అనంతరం సీఎం మాట్లాడుతూ, కొందరు (ఎమ్మెల్యేలు) రాజకీయ ప్రయోజనాల కోసం అవినీతి పద్ధతులకు పాల్పడుతుంటారనీ, ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయడానికి ఈ బిల్లు చాలా అవసరమని చెప్పారు. హిమాచల్ ప్రభుత్వం మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించినట్టు తెలిపారు. దీనికి ముందు ఫిబ్రవరి 29న ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠానియా అనర్హత వేటు వేశారు. ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేశారు. వీరిపై స్పీకర్ అనర్హత వేటు వేయడంతో అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం 34కు పడిపోయింది. అయితే ఆ తర్వాత విధానసభ ఉప ఎన్నికల్లో తిరిగి 40 స్థానాలకు కాంగ్రెస్ చేరుకుంది. విపక్ష బీజేపీకి అసెంబ్లీలో 28 మంది ఎమ్మెల్యేల బలం ఉంది.

## సింగపూర్‌లో మోదీకి ఘన స్వాగతం.. ఢోలు వాయించిన ప్రధాని

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన కొనసాగుతోంది. ఇవాళ బ్రూనై పర్యటనను ముగించుకొని సింగపూర్ వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో సింగపూర్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా మోదీకి ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు మోదీకి గ్రాండ్ వెల్‌కమ్ పలికారు. మోదీకి ఓ మహిళ రాఖీ కూడా కట్టింది. ఈ సందర్భంగా అక్కడ బస చేస్తున్న హోటల్ వద్ద మోదీ ఢోలు వాయించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. మోదీ బ్రూనై, సింగపూర్ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. రెండు రోజుల ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా మంగళవారం బ్రూనై వెళ్లారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధానికి 40 ఏళ్లయిన సందర్భంగా మోదీ ఈ పర్యటన చేపట్టిన వదిషయం తెలిసిందే. ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం భారత ప్రధాని బ్రూనై వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా బ్రూనై రాజు హాజీ హసనల్ బోల్కియాను మోదీ భేటీ అయ్యారు. ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు జరిగినట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు వెల్లడించారు. రెండు దేశాల మధ్య త్వరలోనే నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించేందుకు అంగీకారం కుదిరినట్లు తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి చెన్నై నుంచి బ్రూనై రాజధానికి విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొన్నారు.

# హైడ్రాకు హైపవర్

-మొదటిపేజీ తరువాయి

తెలిసింది. హైడ్రాకు అధికారాలను కట్టబెట్టే విషయంపై ఇటీవల సీఎస్ శాంతికుమారి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్రమ కట్టడాలు, ఆక్రమణల తొలగింపు విషయంలో, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించే విషయంపై ఆగస్టు 29న ఈ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా.. ఆక్రమణల తొలగింపుపై నీటిపారుదల, పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ప్రస్తుతం వేర్వేరుగా నోటీసులు ఇస్తున్నాయని సీఎస్ తెలిపారు. ఇక నుంచి ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న ఆస్తుల సంరక్షణ, అక్రమ నిర్మాణాల కూల్చివేతల తొలగింపునకు హైడ్రా ద్వారానే నోటీసులు ఇవ్వనున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి విధివిధానాల రూపకల్పన బాధ్యతలను పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి అప్పగించారు. ఇందుకు అనుగుణంగా.. పురపాలక శాఖ తాజాగా రెవెన్యూ సహా కీలక విభాగాలకు నోట్ పంపింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే.. హెచ్ఎండీఏపరి?ధిలో ఉన్న 3532 చెరువుల ఆక్రమణలపై, వాటి సంరక్షణపై పూర్తి అధికారాలు హైడ్రా పరిధిలోకే రానున్నాయి.

**ఏయే అధికారాలను బదలాయిస్తారంటే..**

తెలంగాణ భూ ఆక్రమణ చట్టం, తెలంగాణ వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాలు, జీహెచ్ఎంసీ చట్టాల ద్వారా అమలు చేసే అధికారాలను, పంచాయతీరాజ్ పరిధిలో అమలు చేస్తున్న అధికారాలను హైడ్రా పరిధిలోకి తీసుకు రానున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఇప్పటివరకు నోటీసులు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు ఆధ్వర్యంలో ఇస్తున్నారు. నోటీసులు ఇవ్వడం, ఇచ్చిన నోటీసులను తొలగించే అధికారం కేవలం రెవెన్యూ అధికారులకే ఉంది. మునిసిపాలిటీ పరిధిలోనైతే ఆయా సంస్థలకు ఉంటుంది. వాటన్నింటినీ ఇప్పుడు హైడ్రాకు బదలాయించాలంటే జీవో ద్వారా చేయాలా? లేక చట్టంలో మార్పులు తేవాలా? అనే అంశంపై రెవెన్యూ అధికారులు న్యాయసలహా కోరారు. అయితే ఓఆర్ఆర్ పరిధిలోనైతే కొన్ని అంశాల్లో చట్టంలో మార్పులు చేయాల్సి ఉంటుందని, మరికొన్ని అంశాలపై జీవో ద్వారా అధికారాలను బదలాయించవచ్చనే చర్చ జరుగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలు, కూల్చివేతలకు సంబంధించి ఉన్న అధికారాలను జీవో ద్వారా బదలాయించే అవకాశం ఉందని, దాని పరిధిలో లేని చోట్ల చట్టపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ విషయంలో ఇప్పటివరకు రెవెన్యూ శాఖ ద్వారా నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటోంది. ఎక్కడైనా, వాల్టా చట్టం ఉల్లంఘనలు జరిగినా, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నా.. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు ప్రస్తుతం రెవెన్యూ అధికారులకే ఉంది. భూ ఆక్రమణలకు సబంధించి కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ పరిధిలో భూ ఆక్రమణ చట్టం-1905 ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఈ చట్టంలోని సెక్షన్ 5, సెక్షన్ 6 ద్వారా భూ ఆక్రమణకు పాల్పడిన వ్యక్తికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. రెవెన్యూ రికవరీ యాక్ట్-1864 సెక్షన్ 25 ద్వారా రికవరీ నోటీసులు జారీ చేసే అధికారాన్ని కలిగి ఉన్నారు. అలాగే చెరువులు, కాలువల భూభాగంలో నిర్మించిన ఇళ్లపై చర్యలు తీసుకునేందుకు 2002 వాల్టా చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తారు. ఈ తరహా అధికారాలన్నింటినీ ఇకపై హైడ్రాకు కట్టబెట్టనున్నారు.

**3532 చెరువులూ హైడ్రా పరిధిలోకే..**

హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 3532 చెరువులు ఉన్నాయి. వాటిలో అనేక చెరువులు కబ్జాలకు గురయ్యాయి. ఈ చెరువుల్లో ఆక్రమణలన్నింటినీ తొలగించేందుకు అవసరమైన అధికారాలను హైడ్రాకు దఖలు పరచడమే ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. మరోవైపు వీటిలో 230 చెరువులకు సంబంధించి మాత్రమే హెచ్ఎండీఏ తుది నోటిఫికేషన్ ఇచ్చింది. మిగిలిన 2525 చెరువులకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ కాగా.. తుది నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. తుది నోటిఫికేషన్ ఇచ్చిన చెరువుల్లోని ఆక్రమణలను తొలగించడం, ప్రాథమిక నోటిఫికేషన్ వచ్చిన వాటిలో ఆక్రమణలపై కూడా దృష్టి పెట్టే దిశగా హైడ్రాను బలోపేతం చేయనున్నారని సమాచారం.

# సీఎం రేవంత్‌కు వ్యంగ్యం తప్ప.. పరిపాలన వ్యవహారం లేదు

-మొదటిపేజీ తరువాయి

వెళ్తే ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడిందని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. పాలు, నీళ్లు ప్రజలే తేలుస్తారన్నారు. రైతు రుణమాఫీ సగం చేసి చేతి ముడుచుకున్నాడని.. వానాకాలం ఐపోతున్నా రైతుబంధు లేదన్నారు. అవ్వాతాతలకు, వికలాంగులకు పెన్షన్ ఇవ్వక కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తుందని మండిపడ్డారు. ప్రజలు కష్టాల్లో, ఆపదల్లో ప్రైవేట్ హాస్పిటల్లో ఖరీదైన వైద్యం పొందితే కొంత మొత్తాన్ని ఉడతాభక్తిగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసేవాళ్లమని.. ఇందుకు తమ వంతు కృషి చేసిన స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ నాయకత్వంలో సిద్దిపేటను తెలంగాణాలోనే బెస్ట్ నియోజకవర్గంగా అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 9నెలల కాలంలో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని.. కేసీఆర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా సిద్దిపేట తీర్చిదిద్దుకున్నామన్నారు. పదేళ్లలో సిద్దిపేట రూపురేఖలు మార్చుకున్నామని.. సిద్దిపేటలో అనేక విద్యాలయాలు తెచ్చుకున్నామని.. సిద్దిపేటకు మెడికల్ కాలేజ్, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కాలేజీలను సాధించుకున్నామన్నారు. సిద్దిపేటలో విద్యార్థులకు అన్ని రకాల చదువులు అందాలనే ఉద్దేశంతో సిద్దిపేటకు అనేక విద్యాలయాలు తెచ్చామన్నారు. ఇందులో సగం నిర్మాణం పూర్తయిన వెటర్నరీ కాలేజీని కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్‌కు



తరలించుకుపోయిందని ధ్వజమెత్తారు. కొడంగల్‌కు అవసరమైతే కొత్త కాలేజీని నిర్మించుకోవాలని.. సిద్దిపేటకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.150కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ కాలేజీని గద్దలా తన్నుకుపోతున్న సీఎం రేవంత్ రెడ్డి తీరును ప్రజలు గమనించాలని కోరుతున్నానన్నారు. 9 నెలలు అయింది కోమటి చెరువు దగ్గర శిల్పారామం పనులు ఆగిపోయాయని.. పనులు కాకుండా అడ్డుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేటకు రావాల్సిన పనులను హక్కుగా తీసుకొని వస్తానని.. తన ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# హైడ్రా పేరు చెప్పి లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవు

**హైదరాబాద్ :** హైడ్రా అధికారులమని చెప్పి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) తెలిపింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. గత కొన్నిరోజులుగా హైడ్రా కూల్చివేతలు చేపడుతోంది. ఇదే సమయంలో పాత నోటీసులను చూపించి కొంతమంది తాము హైడ్రా అధికారులమని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. హైడ్రా పేరు చెప్పి లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్న ఏసీబీ డీజీ హెచ్చరించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా పేరుతో కొందరు ప్రైవేటు , ప్రభుత్వ అధికారులు పాత నోటీసులు ఇస్తున్నారన్నారు. ఫిర్యాదులను సాకుగా చూపి ప్రజల నుంచి లంచాలు డిమాండ్ చేస్తుట్లు తమ నోటీసుకి వచ్చిందన్నారు. డబ్బులు డిమాండ్ చేసిన హైడ్రా పేరును చూపిస్తే ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలన్నారు. అటువంటి ఇన్‌ఫార్మర్ల పేర్లు గోప్యంగా, సురక్షితంగా ఉంచబడతాయని ఏసీబీ డీజీ పేర్కొన్నారు.

వీటిపై ఏసీబీ స్పందించింది. కొందరు ప్రయివేటు వ్యక్తులు, ప్రభుత్వ అధికారులు హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, హైడ్రా అధికారులమని పాత నోటీసులు చూపించి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు గుర్తించామని ఏసీబీ తెలిపింది.

ఇలాంటి ఘటనలపై పలుచోట్ల బాధితులు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొంది. తమ దృష్టికి తీసుకువచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపింది.

**హైడ్రా పేరుతో బ్లాక్ మెయిల్...**

హైడ్రా పేరుతో బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎమ్‌సీఓఆర్ ప్రాజెక్ట్స్ ఎల్ఎల్‌పీని నిర్మిస్తున్న బిల్డర్‌కు హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తి పై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. హైడ్రా పేరిట బెదిరింపులకు పాల్పడుతున్న డాక్టర్ బండ్ల విప్లవ సిన్హా అనే వ్యక్తి పై బిల్డర్లు వాడల రాజేంద్రనాథ్, మంజునాథ్ రెడ్డి పిర్యాదు చేశారు. సోషల్ యాక్టివిస్ట్ , సోషల్ వర్కర్ అని బోర్డు పెట్టుకొని నిర్మాణం పనులు చూడడానికి వస్తున్న కస్టమర్లకు అసత్య ప్రచారం చేశాడు సదరు వ్యక్తి. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో దగ్గరి పరిచయం అని చెప్పి కలిసి దిగిన ఫోటోలు చూపి విప్లవ సిన్హా అనే వ్యక్తి వాట్సఅప్ కాల్ చేసి బెదిరింపులు పాల్పడుతున్నట్లు బిల్డర్లు తెలిపారు.

పిస్తా హౌస్ వద్ద కలుద్దామని చెప్పి అక్కడికి పిలిచి హైడ్రా రంగనాథ్‌తో కలిసి దిగిన ఫోటోలు చూపిస్తూ, రంగనాథ్ తనకు బాగా దగ్గరని అమీన్పూర్‌లో ఎలాంటి విషయమైనా తననే అడుగుతారని బెదిరింపులకు పాల్పడ్డాడని బిల్డర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. “మీ నిర్మాణం జోలికి రావద్దు అంటే తనకు 20 లక్షల రూపాయలు ఇవ్వాలి. లేదంటే హైడ్రా నందు ఫిర్యాదు చేస్తా, ప్రతిరోజు వార్తా పత్రికల్లో మీ నిర్మాణం గురించి తప్పుగా రాయిస్తా” అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. బిల్డర్ల ఫిర్యాదుతో సదరు వ్యక్తిపై అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# హైదరాబాద్‌కు సెప్టెంబర్ టెన్షన్

**హైదరాబాద్ :** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్థమవుతోంది. ఇప్పటికే చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలన్ని మునిగిపోయి.. ఇళ్లల్లోకి నీరు వచ్చేశాయి. ఇక.. హైదరాబాద్ నగరంలోని చాలా ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. అయితే.. ఈరోజు నుంచి సెప్టెంబర్ నెల మొదలవుతున్న నేపథ్యంలో.. హైదరాబాద్ ప్రజలు గజగజా వణికిపోతున్నారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ మాసం వచ్చిందంటే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకులు వెల్లదీస్తున్న నగరవాసులకు.. ఈసారి కూడా అదే భయం వెంటాడుతోంది. ఇప్పటివరకు కేవలం వరుణుడి భయమే ఉన్న నగరవాసులకు.. సెప్టెంబర్ సెంటిమెంట్ కూడా తోడవటంతో.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని.. వణికిపోతున్నాయి. దానికి కారణం.. గతంలో వాళ్లు చూసిన భీకర పరిస్థితులే.హైదరాబాద్‌లో వచ్చిన ఉపద్రవాలు చాలా వరకు సెప్టెంబర్‌లోనే వస్తుండటం.. నగరవాసుల్లో భయానికి కారణవుతున్నాయి. 1908వ సంవత్సరంలో భాగ్యనగరంలో ఉన్న మూసీ నది మహోగ్రరూపం దాల్చడంతో.. నగరంలోని సగభాగం తుడిచిపెట్టుకుపోవటం ఇప్పటికీ నగరవాసులను భయపెడుతూనే ఉంటుంది. ఆ వరదలు కూడా సెప్టెంబర్ నెలలోనే రావటం గమనార్హం. ఈ క్రమంలోనే.. 2000, 2016 సంవత్సరాల్లోనూ సెంప్టెంబర్ నెలలో కుండపోత వర్షాలు హైదరాబాద్ నగరాన్ని అతలాకుతలం చేశాయి. కేవలం 1908, 2000, 2016 మాత్రమే కాదు.. హైదరాబాద్ చరిత్రలో సెప్టెంబర్ మిగిల్చిన చేదు అనుభవాలు ఇంకెన్నో ఉన్నాయంటున్నారు నగరవాసులు. 1591 నుంచి 1908 వరకు 14 సార్లు హైదరాబాద్ నగరాన్ని వరదలు ముంచెత్తాయి. 1631, 1831, 1903 సంవత్సరాల్లో భారీ వరదలతో భాగ్యనగరం అల్లాడిపోయింది. ఆ వరదలు.. పెద్ద ఎత్తున ధన నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా మిగిల్చాయి. 1908 సెప్టెంబరు వరదల్లో హైదరాబాద్ నగరంలోని ఏకంగా 2 వేల ఇళ్లు కొట్టుకుపోవటం.. 15 వేల మంది మృతి చెందటం.. 20 వేల మంది నిరాశ్రయులవటం.. ఇప్పటికీ నగర చరిత్రలో ఓ భీకర అనుభవమే. ఆ వరదల సమయంలో వారం రోజుల పాటు జనజీవనం స్తంభించిపోయింది. 1631లో కుతుబ్ షాహీ ఆరో పాలకుడు.. అబ్దుల్లా కుతుబ్ షా కాలంలో వచ్చిన వరదలకు భవనాలు ధ్వంసం అయ్యాయి. మూసీ నది చుట్టు ప్రక్కల ఉన్న ఇళ్లు వరదలకు కొట్టుకుపోయాయి. వేలాది మంది నిరాశ్రయులైనట్టు చరిత్ర చెప్తోంది. 1831లో అసఫ్ జాహీ నాలుగో మీర్ ఫరుకుందా అలీఖాన్ నాసరుదౌలా పాలనా సమయంలోనూ.. భాగ్యనగరంలో భారీ వరదలు వచ్చాయి. ఆ సమయంలో.. నిర్మాణంలో ఉన్న చాదర్‌ఘాట్ వంతెన కొట్టుకుపోయింది. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ పాలనా కాలంలోనూ.. 1903లో సెప్టెంబర్ నెలలోనే భారీ వర్షాలకు హైదరాబాద్ నగరం అల్లాడిపోయింది.ఇలా... 1968, 1984, 2000, 2007, 2016, 2020 సంవత్సరాల్లోనూ భారీ వర్షాలు కురిసి మూసీ నది

## ప్రజల్లోకి వెళ్లడంపై వ్యూహ రచన

-మొదటిపేజీ తరువాయి

భవన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. రైతుల సమస్యలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయడంలో విఫలమవ్వడం తదితర అంశాలను ప్రజల్లోకి ఏవిధంగా తీసుకువెళ్లాలన్న దానిపై ఆయన చర్చించనున్నట్లు తెలిసింది.బీఆర్ఎస్ తరఫున క్షేత్రస్థాయిలో తరచూ కార్యక్రమాలు చేపట్టడం, ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయడంపై ప్రణాళికలు రూపొందించనున్నట్లు సమాఆరం. సాగునీరు, విద్యుత్తు కష్టాలతోపాటు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకపోవడం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా కేసీఆర్ నిరసనలు, రోడ్‌షోలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా, గ్రామ, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు ఇప్పట్లో సాధ్యం కాదని బీఆర్ఎస్ ముఖ్యనేత ఒకరు అభిప్రాయపడ్డారు. పార్టీ సభ్యత్వాలను ప్రతి నాలుగేళ్లకు ఒకసారి చేయాల్సి ఉంటుందని, ఇప్పటికే చేపట్టిన సభ్యత్వాల నమోదు ప్రక్రియ పూర్తయి మూడేళ్లయిందని, దీంతో మరో ఏడాదికి సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే.. గ్రామ, మండల కమిటీలను నియమించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## సముద్ర తీరానికి 30 కిలోమీటర్ల రోడ్లకు స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలి

సింధుదుర్గ్‌లో ఇటీవల 35 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ అంశం గురించి కేంద్ర రోడ్డు, రవాణా, హైవేస్ మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. ఒకవేళ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఆ విగ్రహాన్ని నిర్మించి ఉంటే, అప్పుడు ఆ విగ్రహం కూలి ఉండేది కాదు అని ఆయన అన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో రస్ట్ రెసిస్టెంట్ మెటీరియల్స్ వాడకం ముఖ్యమని ఆయన గుర్తు చేశారు. తుప్పు పట్టని ఇనుము వాడాలని సూచించారు. సముద్రానికి దగ్గరలో నిర్మిస్తున్న బ్రిడ్జ్‌లకు స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలని గత మూడేళ్ల నుంచి చెబుతున్నాని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో ముంబైలో 55 ఫ్లైఓవర్లు నిర్మాణ పనులను పర్యవేక్షించానని, ఐరన్ రాడ్లకు ఏదో ఒక పౌడర్ వేసి వాటిని రస్ట్ ప్రూఫ్‌గా చూపించారని, కానీ ఆ ఇనుము తుప్పు పట్టిందన్నారు. సముద్ర తీరానికి 30 కిలోమీటర్ల పరిధిలో ఉండే అన్ని రోడ్లకు స్టెయిన్‌లెస్ స్టీల్ వాడాలని సూచిస్తున్నట్లు తెలిపారు.ఒకవేళ ఇటీవల కూలిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని స్టెయిన్‌లెస్ స్టీల్‌తో చేసి ఉంటే, అది కూలేది కాదు అని మంత్రి గడ్కరీ తెలిపారు.నేవీ డే సెలబ్రేషన్స్ సందర్భంగా 2023 డిసెంబర్ 4వ తేదీన శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఓపెన్ చేశారు. అయితే ఆ విగ్రహం ఆగస్టు 26వ తేదీన కూలింది. ఈ ఘటనలో సింధుదుర్గ్ పోలీసులు శిల్పి జయదీప్ ఆప్టే గురించి లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

## తెలంగాణలో రేవంత్ రెడ్డి చేసేది కరెక్ట్,

**హైదరాబాద్ :** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా చేస్తున్న కూల్చివేత పట్ల పవన్ కల్యాణ్ ప్రశంసించారు. హైడ్రా లాంటి వ్యవస్థ మంచిదే అని, రేవంత్ రెడ్డి చేస్తున్న పని మంచిదే అని కొనియాడారు. వరద రావడం లేదనే ఉద్దేశంతో తెలంగాణలోనే కాక ఏపీలో కూడా ఎంతో మంది పరివాహక ప్రాంతాలను ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నారని చెప్పారు. ఇందుకు ఒకరు కారణం కాదని.. ఎంతో మంది వ్యక్తులు ఎన్నో ఏళ్లుగా ఇలా ఆక్రమణలకు పాల్పడడం వల్లే ప్రస్తుతం వరదలు వస్తున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు.“2014-19లో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో వచ్చిన హుదూద్ తుపాను వేళ ముఖ్యమంత్రి చాలా సమర్థంగా వ్యవహరించారు. ఆ సమయంలో కూడా నేను రూ.50 లక్షల విరాళం ఇచ్చాను. నిన్న కూడా విజయవాడ వరదల కోసం రూ.కోటి సీఎం రిలీఫ్ ఫండ్ కు ఇచ్చాను. బుడమేరు వాగు చుట్టుపక్కల దాదాపు 90 శాతం ఆక్రమణలు ఉన్నాయి. ఆ స్థలాల్లో ఇళ్లు కూడా నిర్మించేవారు. ఆ ఇళ్లకు కనీసం డ్రైనేజీ సౌకర్యం సరిగ్గా లేదు. హైదరాబాద్ లో కూడా ఈ మధ్య హైడ్రా వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్ జోన్ పరిధుల్లో నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చేస్తున్నారు.

20 - 30 ఏళ్లుగా ఏ వరద లేదు కదా అనే ఉద్దేశంతో చాలా మంది చెరువు పరివాహక ప్రాంతాలను ఆక్రమించేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లో లే అవుట్లు చేయడం అనేది కొన్ని ఏళ్లుగా జరుగుతూనే ఉంది. ఇదేదో ఒకరి పని కాదు. కానీ, గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం తమ హయాంలో ఎంతో కొంత చర్యలు తీసుకొని ఉండాల్సింది. ఇప్పుడు చంద్రబాబు ఆ వయసులో కూడా పొక్లెయిన్‌లు, పడవలు, బుల్డోజర్లు ఎక్కి చేరుకోలేని ప్రాంతాలకు సైతం చేరుకోవడం చాలా అభినందనీయం. అలాంటి వ్యక్తిని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. ఒక్కసారి ఆయన పనిని గుర్తించి వైసీపీ నేతలు మాట్లాడాలి” అని పవన్ కల్యాణ్ అన్నారు.

## భారీ వర్షాలు ,విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి

**హైదరాబాద్ :** ప్రకృతి విలయ తాండవం చేస్తున్నప్పుడు మనమందరం జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా ఎక్కువగా విపరీతమైన వర్షాలు పడుతున్నప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోండని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్యాబినెట్ మంత్రులు ,ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీ మొత్తం పునరావాస కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంది. రాజకీయం చేసే వారు రాజకీయం చేస్తుంటారు..ప్రజలకు అండగా ఉండే బాధ్యత గల ప్రభుత్వంగా మేము అన్ని రకాల కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రకృతి విపత్తును అపగలిగే శక్తి ఎవరికీ లేదు. దాని నుండి ఏవిధంగా నివారించుకోవాలి..ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ప్రభుత్వం నుండి చెప్తున్నాం. నష్టాన్ని ఏ విధంగా పూడ్చుకోవాలని ప్రయత్నం చూస్తున్నాం..కేంద్రం నుండి సహకారం కోరుతున్నాం. మనం కూడా మన బాధ్యతగా కార్యక్రమాలు నిర్వహించుకునే ప్రయత్నం చేద్దాం. ఎక్కడైనా విపత్తు వస్తే రాష్ట్ర వ్యాప్తంగా అధికారులందరికి ఆదేశాలు ఇచ్చాం. అధికారులంతా స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలి. పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండి సహాయ కార్యక్రమాల్లో ఉండాలని మా పార్టీ నాయకత్వాన్ని కోరినం. మేము కూడా నియోజకవర్గాల్లో ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వం చేయడమే కాదు ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉంటూ సహకారాలు అందించాలి. ప్రజా పాలన లో ఈ ప్రభుత్వం మీ అందరికీ అండగా ఉంటుందని మాట ఇస్తున్నానని అన్నారు.

## పవర్ లూం క్లస్టర్‌ను మంజూరు చేయండి

-మొదటిపేజీ తరువాయి

నేపథ్యంలో సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని కోరారు. ఢిల్లీలో గిరిరాజ్ సింగ్ ను కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ను ఏర్పాటు చేయడంవల్ల వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా యంత్రాల ఆధునీకరణతోపాటు ఉత్పాదకతను, కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతుందన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతోపాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అట్లాగే యార్న్ డిపో ఏర్పాటువల్ల సిరిసిల్లో నేత కార్మికులకు ముడి సరకులు సులభంగా తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ప్రస్తుతం నేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, పెరిగిన ఖర్చులవల్ల ముడిసరకులను కూడా కొనుగోలు చేయడం కష్టమైందన్నరు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని 80 శాతానికి పెంచడంతోపాటు పావులా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బండి సంజయ్ విజ&ఝప్తిపట్ల జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారు. యార్న్ డిపో ఏర్పాటుతోపాటు పవర్ లూం క్లస్టర్ మంజూరుపై చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 80 శాతం సబ్సిడీ, పావులా వడ్డీకే రుణాలు వంటి అంశాల అమలు సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

# వర్షాలు పడినప్పుడే ప్రభుత్వాలు చేసిన పనులు బయటపడతాయి





**రావులపల్లి రోడ్డు, ఫతేపూర్ బ్రిడ్జి రోడ్డును పరిశీలించిన ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి**

**రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపిస్తా**

**చేవెళ్ల , శుభ తెలంగాణ:** వర్షాలు పడినప్పుడే ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులు బయటపడతాయని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఫతేపూర్ బ్రిడ్జి పక్కన గల రోడ్డు పనులను, రావులపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డును, మోకిలలోని లా పలోమా విల్లాస్ లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్ల మరమ్మతుల గురించి ఆర్ అండ్ బి అధికారులతో ఎంపీ ఫోన్ లో మాట్లాడారు. ఎంపీ మాట్లాడుతూ రావులపల్లి గ్రామ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఫతేపూర్ బ్రిడ్జి పక్కన రోడ్డు పనులను వేగవంతం చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులకు ఎంపీ సూచించారు. రైల్వే బ్రిడ్జి వేయడం వల్ల క్రాసింగ్ లెవెల్ లేకపోవడం వలన వరద నీరు బయటికి వెళ్లలేక పోతుందని వార్డు ప్రజలు ఎంపీకి వెల్లడించారు. రైల్వే బ్రిడ్జి పక్కన 150 ఎకరాల రైతులకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులు ఎంపీకి మొరపెట్టుకున్నారు. ఫతేపూర్ రైల్వే బ్రిడ్జిని ఎంపీ పరిశీలించి అక్కడ ఉన్న వరద నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని నీటిని నాలాల వెంట పంపాలని నీ ఎంపీ అధికారులకు సూచించారు. ఎంపీని రావులపల్లి గ్రామస్తులు సన్మానించారు.కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్, మున్సిపల్ ఇన్చార్జి వాసుదేవ్ కన్నా, మున్సిపల్ అధ్యక్షుడు సురేష్, 8వ వార్డు కౌన్సిలర్ రాములు, మాజీ ఎంపీపీ నర్సింలు, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ హనుమంత్ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, పండిత్ రావు, మండల, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలకు కృషి చేస్తా

**-మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి**



**ఎల్బీనగర్ , శుభ తెలంగాణ:** అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస రెడ్డి అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఇప్పటికే పలు మార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, త్వరలో కొత్త పాలసీ రూపకల్పన ద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ తో పాటు పలువురు ప్రతినిధులు మంగళవారం మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య, తమ సొసైటీ విషయాలపై చర్చించారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. తమ సొసైటీ 2008 లో ఏర్పడిందని, అప్పటి నుంచి మూడు దఫాలుగా జర్నలిస్టుల నుంచి సభ్యత్వం తీసుకోవడం జరిగిందని, ప్రస్తుతం సొసైటీలో 1300 మంది సభ్యులున్నారని అధ్యక్షుడు మామిడి సోమయ్య వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వివిధ పత్రికలు,ఛానెళ్ళలో పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులు చాలా ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇదిలా ఉండగా మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉందని, అయితే ఏ విధంగా ఇవ్వాలన్న విషయంలో కసరత్తు చేయాల్సి ఉన్నందున దీనికి కొంత సమయం పడుతుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఉన్న 1300 మంది జర్నలిస్టుల అర్హత, సీనియారిటీ ప్రకారం లిస్టు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు యర్రమిల్లి రామారావు, కరుణాకర్, అంజిరెడ్డి, నాగవాణి, టి. శాంతి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





**తట్టి అన్నారం కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి**

**విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతంగా చదువుకోవాలి**

**పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబి రాజు**

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి - ఒక మొక్క కార్యక్రమం**

**తట్టి అన్నారం ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు బహుకరణ**





**ఇబ్రహీంపట్నం, , శుభ తెలంగాణ:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఒక విద్యార్థి - ఒక మొక్క అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వ వార్డు తట్టి అన్నారం పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హరితహరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి పల్లవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామాల్లో, ఖాళీ ప్రదేశాలతో పాటు ప్రతి ఇంటి ఆవరణలో ఆరు మొక్కలు విధిగా నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను విధిగా నాటి భవిష్యత్ తరాలకు కానుకగా అందించాలని కోరారు. మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బి.రాజు మాట్లాడుతూ...నేటి బాలలే రేపటి పౌరులని, నవ సమాజం నిర్మితం కావాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. పాఠశాలల అభివృద్ధికి,విద్యార్థులకు తమ కళాశాల యాజమాన్యం అన్ని విధాలా సహాయ,సహకారాలు అందిస్తుందని పల్లవి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రామ శేషగిరిరావు పేర్కొన్నారు. అనంతరం పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లను, నోట్ పుస్తకాలను, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయశేకర్ రెడ్డి, పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బి రాజు, కళాశాల మేనేజ్మెంట్ రిప్రెజెంటేటిట్ ఎం.రాజేందర్ రెడ్డి, ఏవో అంబాల శ్రీధర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండల్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూప్సింగ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సైదులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీనివాస్, హెచ్వోడి విశ్వ ప్రకాష్ బాబు, ఎన్ఎస్ఎస్ అధ్యాపక కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం



**చేవెళ్ల, శుభ తెలంగాణ :** మతి మతిస్థిమితం లేని బాలిక అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన ఎండీ దస్తగిరి సోదరి ఫరిదా బేగం (16)కు మతిస్థిమితం లేదని, అప్పుడప్పుడు తనకు ఫిట్స్?? వస్తుందని తెలిపారు. ఈనెల 3వ తేదీ రాత్రి ఇంట్లోంచి ఫరిదా బేగం ఎవరీకి చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదన్నారు. చుట్టు పక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఎండీ దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

## ప్రభుత్వం ఆదుకోవాలి



**చేవెళ్ల, శుభ తెలంగాణ:** గత మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తు వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చేవెళ్ల మండల పరిధి తల్లారం అనుబంధ గ్రామం దుద్దాగు గ్రామంలో కోనపురం నర్సింహులుకు చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయింది. ఈ సందర్భంగా బాధితుడు తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

## విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి..... చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య





**చేవెళ్ల, శుభ తెలంగాణ:** విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల రెసిడెన్షియల్ వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. వంటగదిని, గురుకుల పరిసరాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్య సమస్యల నుండి దూరంగా ఉండడానికి శుభ్రతను పాటించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్యాధికారులు ఎప్పటికప్పుడు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రతిరోజు మినరల్ వాటర్ ను అందించాలని చెప్పారు. రాత్రి సమయంలో వసతి గృహంలో దోమల బెడద లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఎమ్మెల్సీ కోదండరామ్‌కు గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ నేతల సన్మానం...

**ఎల్బీనగర్, శుభ తెలంగాణ :** తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులుగా నియమితులైన తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ కు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ నాయకులు అభినందనలు తెలియజేశారు. బుధవారం హైదరాబాద్ లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఆయనకు జరిగిన పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ను పూలబొకే, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, నాయకులు తన్నీరు శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, పులిపలుపుల ఆనందం, సీహెచ్ వీరారెడ్డి తదితరులు కూడా ప్రొఫెసర్ కోదండరాం ను సన్మానించారు.

## బురదమయంగా మారిన శంకర్ పల్లి రిత్విక్ కాలనీ రోడ్లు....



**శంకర్ పల్లి, శుభ తెలంగాణ :** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని రిత్విక్ వెంచర్లో కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయంగా మారాయి. బుదదలో కాలనీవాసులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీలో 65 ఇండ్లు ఉన్నాయి. అందులో సుమారు 250 మంది ప్రజలు నివసిస్తున్నారు ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు పన్నుల రూపంలో స్థానిక మున్సిపల్ కార్యాలయానికి అందుతున్నాయి. ఈ కాలనీ ఏర్పడి సుమారు 14 సంవత్సరాల అయింది. ఆనాటి నుండి ఈనాడు వరకు కాలనీవాసులు సరైన రోడ్లు లేక కురిసిన వర్షానికి బుదదయంగా మారడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు అప్పటి గ్రామ పంచాయతీ అధికారులకు కాలిని రోడ్ల విషయం వివరించిన ఫలితం లేకుండా పోయిందని కాలినివాసులు వాపోతున్నారు. కాగా రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు స్మశాన వాటిక రోడ్డు ద్వారా కాలనీకి వచ్చే రోడ్డు ఒక ప్రక్క కూలిపోయింది. ఆనాటి నుండి ఈ బ్రిడ్జి పనులు చేపట్టాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు, నాయకులకు విన్నవిస్తూనే ఉన్నారు. స్మశాన వాటిక రోడ్డు కూడా బురదమయంగా మారింది. గొల్లవాగుపై నిర్మించిన కల్వర్టు ఒక పక్క కూలిపోయినందున మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ వ్యవసాయ మార్కెట్ కు చెందిన ప్రహరీ గోడను తొలగించి వాహనాలు పెరగడానికి సౌకర్యం కల్పించారు. కాగా ఈనెల రెండవ తేదీన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తన సిబ్బందితో కాలనీకి వచ్చే కల్వర్టును, రోడ్లను పరిశీలించారు. త్వరలో బురదమైన రోడ్లపై మొరం పోయిస్తానని కాలనీవాసులకు తెలపడం జరిగింది. వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టి కాలనీలో ఉన్న బురద రోడ్లపై మొరం పోయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలుశిక్ష

**హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక**

**హైదరాబాద్ , శుభ తెలంగాణ:** హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడితే జైలు జీవితం తప్పదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో హైడ్రా విభాగం అక్రమ నిర్మాణాల తొలగింపులు చేపడుతున్న నేపథ్యంలో కొద్దిమంది సామాజిక కార్యకర్తల ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నారు. బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో లేదా వాటి పరిసరాల్లో నిర్మాణం చేపడుతున్న బిల్డర్ల ను ఇది అక్రమ నిర్మాణమని, బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో నిర్మిస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారు. అలాగే అధికారులతో ఉన్న ఫొటోలు చూపించి హైడ్రా విభాగంలోని ఉన్నతాధికారులతో తమకు పరిచయాలు ఉన్నాయని, మీకు



ఎలాంటి సమస్య రాకుండా చేస్తామని ఇందుకోసం కొంత డబ్బు ముట్టజెప్పాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని కొంతమంది వ్యక్తులు, సంస్థలు, బిల్డర్లను, బహుళ అంతస్తులు, వ్యక్తిగత గృహాల్లో నివాసం ఉంటున్న వారి వద్ద ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా ఇలాంటి బెదిరింపులకు పాల్పడినా ఇతర ప్రభుత్వ విభాగాలైన రెవ్యూ, మున్సిపల్, నీటి పారుదల విభాగాల్లో ఇలా ఒత్తిడి చేస్తే ప్రజలు, బిల్డర్లు తక్షణమే స్థానిక పోలీస్ స్టేషన్‌లో గాని ఎస్పీ, సీపీకి గాని లేదా హైడ్రా కమిషనర్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ విభాగాన్ని నీరు గార్చాలని చూసినా, తప్పుదోవ పట్టించే విధంగా ప్రయత్నించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నా ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తా

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట, శుభ తెలంగాణ :** సిద్దిపేటను ఓర్వలేక ఇక్కడి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారు 150 కోట్ల వెటర్నరీ కాలేజీని గద్దలా ముఖ్యమంత్రి కొడంగల్‌కు తన్నుకు పోయాడు. తీసుక పోయిన వెటర్నరీ కళాశాలను సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు తీసుకరావాలి అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిస్థా. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు. ఈ సందర్భంగా 190 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా హరీష్ రావు మాట్లాడుతూ. సీఎం రేవంత్ కు వ్యంగ్యం తప్ప. పరిపాలన వ్యవహారం లేదుకాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షాల మీద దాడులు, కక్ష సాధింపులు.. హామీలు అమలు లేదు పరిపాలన పై పట్టి లేదు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారం లోకి పాలన ఆగం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అపదలో పార్టీ పక్షాన అదుకునేందుకు పోతే ఎమ్మెల్యే ల పై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు పాలు నీళ్ల ప్రజలే తెలుస్తారు రైతు రుణ మాఫీ సగం చేసి చేతి ముడుచుకున్నాడు. వాన కాలం ఐపోతుంది రైతు బందు లేదు... అవ్వా తాత లకు, వికలాంగుల కు పెన్షన్ ఇవ్వక అగం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రజలు కష్టాల్లో, ఆపదల్లో



ప్రైవేట్ హాస్పిటల్లో ఖరీదైన వైద్యం పొందితే కొంత మొత్తాన్ని ఉడతాభక్తిగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసేవాళ్లం. ఇందుకు తమ వంతు కృషి చేసిన స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు అభినందనలు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ నాయకత్వంలో సిద్దిపేటను తెలంగాణాలోనే బెస్ట్ నియోజకవర్గంగా మీ అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నాం. కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. కేసీఆర్ గారి ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా సిద్దిపేట తీర్చిదిద్దుకున్నాం. 10ఏళ్లలో సిద్దిపేట రూపురేఖలు మార్చుకున్నాము. సిద్దిపేటలో అనేక విద్యాలయాలు తెచ్చుకున్నాం. సిద్దిపేటకు మెడికల్ కాలేజ్, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కాలేజీలను తెచ్చుకున్నాం. సిద్దిపేటలో విద్యార్థులకు అన్ని రకాల చదువులు అందాలనే ఉద్దేశంతో సిద్దిపేటకు అనేక విద్యాలయాలు తేవడం జరిగింది.

# తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధిత సహాయార్థం కోటి రూపాయలు విరాళం ప్రకటించిన చిరంజీవి

ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు తమ వంతు సాయం అందించటానికి హీరో చిరంజీవి ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారు. ఈ విషయం పలుసార్లు నిరూపితమైంది. చిరంజీవి ఐ అండ్ బ్లడ్ సెంటర్‌ను స్థాపించి ఇప్పటికే ఎందరికో అండగా నిలిచిన చిరంజీవి.. ప్రజలపై ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడల్లా ఇండస్ట్రీ తరపు నుంచి నేనున్నా అంటూ సాయం చేయటానికి ముందుకు వస్తుంటారు. కరోనా సమయమైనా, హుదూద్ తుపాను సమయంలోనైనా.. ప్రజలు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నారంటే తనవంతు అండదండలను అందించటమే కాకుండా తన అభిమానులను సైతం అండగా నిలవమని చెప్పి స్ఫూర్తినిస్తుంటారు చిరంజీవి. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాదు.. ఇతర రాష్ట్రాల్లోని వారు ఇబ్బందుల్లో ఉన్నా ఆయన స్పందించి తన గొప్ప మనసుని చాటుకున్న సందర్భాలు కోకొల్లలు. ఇటీవల కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి భారీ ప్రాణ నష్టం జరిగినప్పుడు కూడా.. విచారాన్ని వ్యక్తం చేయటమే కాకుండా చిరంజీవి తన కుటుంబం తరపు నుంచి కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించటమే కాకుండా, కేరళ



ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ప్రత్యేకంగా కలిసి చెక్‌ను అందించి వచ్చిన సంగతి తెలిసిందే. గత కొన్నిరోజులుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. వీరిని ఆదుకోవటానికి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కష్టపడుతున్నాయి. వీరికి తెలుగు చిత్ర పరిశ్రమ బాసటగా నిలుస్తోంది. ఈ క్రమంలో చిరంజీవి తన వంతు సాయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.50 లక్షలు.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.50 లక్షలను వరద బాధితుల సహాయార్థం విరాళంగా ప్రకటించారు. “తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రభావం వల్ల ప్రజలకు కలిగిన, కలుగుతున్న కష్టాలు నన్ను కలిచివేస్తున్నాయి. పదుల సంఖ్యలో అమాయక ప్రాణాలు కోల్పోవడం ఎంతో విషాదకరం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నిర్దేశంలో రెండు ప్రభుత్వాలు శాయశక్తులా పరిస్థితిని మెరుగు పరచడానికి కృషి చేస్తున్నాయి. మనందరం ఏదో విధంగా సహాయక చర్యల్లో పాలుపంచుకోవాల్సిన అవసరం వుంది. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రాష్ట్రాల లో ప్రజల ఉపశమనానికి తోడ్పాటుగా నా వంతు కోటి రూపాయలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్ కు చెరో 50 లక్షలు) విరాళంగా ప్రకటిస్తున్నాను. ఈ విపత్కర పరిస్థితులు తొందరగా తొలగిపోవాలని, ప్రజలంతా సురక్షితంగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను” అని పేర్కొన్నారు చిరంజీవి.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి**

**ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి**

**విష జ్వరాలు ఉన్న గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించండి**

**రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**మంథని, శుభ తెలంగాణ :** రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రజలకు సూచించారు. బుధవారం మంథని పట్టణ శివారులో ఉదృతంగా ప్రవహిస్తున్న గోదావరినదీ నీటి ప్రవాహాన్ని భారీ వర్షం లోనే మంత్రి శ్రీధర్ బాబు పరిశీలించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, విపత్తును ఎదుర్కోవడానికి మా ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్రల కురుస్తున్న భారీ వర్షాలు, మన రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వస్తున్న వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరద నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారని తెలిపారు. మంథని మునిసిపల్ ప్రాంతంలో కాలువలలో మురికినీరును, అక్కడక్కడ చెత్తాచెదారాలను వెంట వెంటనే క్లీన్ చేయాలని మున్సిపల్ సిబ్బంది



పనిచేయాలని ఆదేశించారు, గత ఐదు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వల్ల దోమల ద్వారా వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ వైద్యాధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏ గ్రామంలో విష జ్వరాలు వస్తే ఆ గ్రామాన్ని వెంటనే హెల్త్ క్యాంపు నిర్వహించి వారికి వైద్య సదుపాయం అందించాల న్నారు, మంథని నియోజకవర్గంలో ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రతి వ్యక్తికి మెరుగైన వైద్య సదుపాయాన్ని ఇవ్వాలని జిల్లా వైద్య అధికారులను మంత్రిగారు ఆదేశించారు విపత్తును ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారితో ఫోన్లో మాట్లాడుతూ ఎక్కడైతే పంట నష్టం జరిగిందో అధికారులు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి ఆ రైతులకు ధైర్యం చెప్పి స్పష్టంగా పంట నష్టం ఎంత జరిగిందో చూడాలని అధికారులను మంత్రిగారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమా సురేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండా శంకర్ ముస్కుల సురేందర్ రెడ్డి, అజీమ్ ఖాన్, ఆకుల కిరణ్, గుండా పాపారావు లతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అమెరికాలో ప్రమాదం, నలుగురు హైదరాబాదీలు మృతి

**హైదరాబాద్ :** అమెరికాలోని టెక్సాస్‌లో 5 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీలతో సహా నలుగురు భారతీయులు మరణించారు. అందరూ ఒకే కారులో భారతీయ కార్‌పూలింగ్ యాప్ ద్వారా అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు ప్రయాణిస్తున్నారు. మృతులను హైదరాబాద్‌కు ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి, ఫరూక్ షేక్, లోకేష్ పాలచర్ల, తమిళనాడుకు చెందిన దర్శిని వాసుదేవన్‌లుగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొల్లిన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం వైట్ స్ట్రీట్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.. వేగంగా వచ్చిన ట్రక్ అదుపుతప్పి ఎస్‌యూవీ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఆ తర్వాత ట్రక్కు మరో నాలుగు వాహనాలను ఢీకొని డివైడర్‌ను ఢీకొట్టింది. అందరూ తేరుకునేలోపే కారు వాహనం మంటల్లో చిక్కుకుంది. నలుగురు భారతీయులు కారులో చిక్కుకున్నారు. మంటల కారణంగా నలుగురూ సజీవదహనమయ్యారు. కార్‌పూలింగ్ యాప్ ద్వారా స్థానిక పోలీసులు వారిని గుర్తించారు. హైదరాబాద్ నివాసి ఆర్యన్ రఘునాథ్ ఓరంపాటి అతని స్నేహితుడు ఫరూక్ షేక్‌తో కలిసి డల్లాస్‌లోని తమ బంధువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కాగా, లోకేష్ తన భార్యను కలవడానికి బెంటన్‌విల్లేకు వెళ్తున్నాడు. ఇక తమిళనాడుకు చెందిన ధరిణి వాసుదేవన్ టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదివిన తర్వాత అక్కడే పనిచేస్తున్నారు. ఆమె బెంటన్‌విల్లేలోని తన మామ వద్దకు వెళ్తున్నారు. ఈ నలుగురూ కార్‌పూలింగ్ యాప్ ద్వారా కనెక్ట్ అయిన తర్వాత అర్కాన్సాస్‌లోని బెంటన్‌విల్లేకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఆర్యన్ ఓరంపాటి ఇటీవలే ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాకు వెళ్లాడు. అతని తండ్రి సుభాష్ చంద్రారెడ్డి హైదరాబాద్‌లో వ్యాపారవేత్త. హైదరాబాద్‌కు చెందిన ఫరూక్ షేక్ మాస్టర్స్ డిగ్రీ కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లి బెంటన్‌విల్లేలో నివసిస్తున్నాడు. భారతీయులంతా కాలిపోయిన తర్వాత వారి మృతదేహాలను గుర్తించడం కష్టంగా మారింది. వారి శరీర భాగాల నమూనాలను డిఎన్ఏ పరీక్ష కోసం ఉంచారు. 3 రోజుల తర్వాత కుమార్తె మృతి చెందిన విషయం ధరిణి తండ్రికి తెలిసింది. అంతకు ముందు, తన కూతురు అదృశ్యంపై సమాచారంతో ట్విట్టర్‌లో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ సహాయం కోరారు. కాగా, వారి అవశేషాలు భారత్ రప్పించేందుకు బాధితుల కుటుంబాలు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారుల సహాయాన్ని కోరుతున్నాయి.

## సిరిసిల్లలో పవర్ లూంక్లస్టర్

**కరీంనగర్ :** సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను బుధవారం నాడు బండి సంజయ్ కలిశారు. పవర్ లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గిరిరాజ్ సింగ్ ను బండి సంజయ్ కోరుతూ వినతిపత్రం అందజేశారు. నేషనల్ హ్యాండ్లూం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు డిపో(యార్న్ డిపో)ను ఏర్పాటు చేయాలని రిక్వెస్ట్ చేశారు. ఫ్యాషన్ పెరిగిపోయి, సంప్రదాయ ఉత్పత్తులకు పోటీ పెరిగిపోయిందని, దాంతోపాటు ముడిసరుకు ధరలు పెరగడంతో ఉత్పత్తుల ధర అధికం అవుతుందన్నారు. కనుక ముడిసరుకు ఖర్చులు పెరగడంతో చేనేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని.. వారికి సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని బండి సంజయ్ కోరారు. సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ను ఏర్పాటు చేస్తే, స్థానికంగా వేలాది మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. సంప్రదాయ మెషీన్లు కాకుండా, ఆధునిక యంత్రాలు వారికి అందిస్తే.. ఉత్పాదకత పెరుగుతుందని గిరిరాజ్ సింగ్ కు తెలిపారు. కార్మికులు సాధ్యమైనంత త్వరగా నేత ఉత్పత్తులను అందిస్తూ, అప్పు ల బాధ లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటారని పేర్కొన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతోపాటు వారి మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు.

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అక్రమ, కబ్జా కట్టడాను తొలగించాలి

**తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మ చక్రం సంస్థ అధ్యక్షురాలు యామినీ లక్ష్మి**

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** ప్రకృతి విలయ తాండవం.. వర్షం వరద వలయం లో మునిగిన రెండు తెలుగు రాష్ట్రాల కు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో అందరికీ తెలిసిన విషయమే. ఈ నేపద్యం లో ధర్మ చక్రం సంస్థ అధ్యక్షురాలు యామినీ లక్ష్మి స్పందించారు. త్వరగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అక్రమ, కబ్జా కట్టడాలని తొలగించి.. కనీసం వచ్చే సంవత్సరం వర్షాలు వచ్చే లోపల.. అన్నీ సరి దిద్ది బాగు చేయాలని కనీసం వచ్చే సంవత్సరం వర్షాలు వచ్చే లోపల.. అన్నీ సరి దిద్ది బాగు చేయాలని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు కావచ్చు, ఉన్న ప్రభుత్వాలు ఇప్పటికయినా కళ్ళు తెరచుకుని అక్రమణలకు, కబ్జాలకు గురైన చెరువులు, గుంటలు, వాగులు, వంకలని.. యధావిధిగా ఉండేలా చూడాలి.. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం లో హైడ్రా తో అక్రమ కట్టడాలను కూల్చివేయడం మొదలైన్ది.. ఇంకా ఎన్నో వున్నాయి.. ఈలోపు ప్రకృతి విపత్తు సంభవించడం.. బాధాకరమని.. అసలు కొండలు, గుట్టల్ని పిండి చేసి అక్రమంగా కట్టిన వాటిని, అడవులని నరికి కట్టిన కట్టడాలను వెంటనే కూల్చివేసి.. వాటి ధర్మాలని అవి అంటే ప్రకృతి ని నాశనం చేస్తే తిరిగి మనల్ని నాశనం చేస్తుంది.. జంతువులు, ప్రకృతి వాటి ధర్మం అవి పాటిస్తున్నాయి.. కాని మనిషి వాటిని పాటించడంపాటించడం లేదని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసారు.

## విధుల్లో కొనసాగించాలని సాంఘిక సంక్షేమ గురుకుల సిబ్బంది ధర్నా




**పెద్దపల్లి, శుభ తెలంగాణ :** సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలో గత కొన్ని సంవత్సరాలుగా పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ సిబ్బందిగా సేవలందిస్తున్న వారిని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుండి తప్పించడం పట్ల బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపు నిర్ణయాన్ని విరమించుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. అధికారుల మనసు మార్చి తాము విధుల్లో కొనసాగేలా చేయాలని పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పెద్దపల్లి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగుల వలె విద్యార్థులకు సేవలందిస్తూ కష్టపడుతున్నా మని, విద్యా సంవత్సరం మధ్యలో తమని విధులు నుండి తీసివేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిర్ణయంతో మా జీవితాలు రోడ్డు పాలయ్యాయని, మానవతా దృక్పథంతో వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

## పేదల ప్రభుత్వ కాంగ్రెస్ పార్టీ


**హుజురాబాద్ , శుభ తెలంగాణ:** హుజురాబాద్ నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎవరు ఆపదలో ఉన్న, ఎలాంటి కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటానని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నదని, హుజురాబాద్ నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉందని, ఎవరు ఆధైర్యపడవల్సిన అవసరం లేదని బుధవారం రోజున హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ కారణాల వల్ల అనారోగ్యం చెందినవారికి వారి కుటుంబాలకు భరోసాగా సిఎం,ఆర్,ఎఫ్ చెక్కులు అందజేసిన సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వోడితల ప్రణవ్ నియోజకవర్గంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అర్హులైన నిరుపేదలందరికి సహాయం అందుతుందన్నారు.

# మామిడి ఆకులతో క్యాన్సర్, గుండె జబ్బులు పరార్!



మామిడి ఆకులు కడుపులో మంచి బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తాయి. శరీరంలోని అదనపు కేలరీలను బర్న్ చేసి లావు తగ్గేలా చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్ చేస్తాయి. ఉబ్బరం, వాపు, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలు తొలగిపోతాయి. లేత మామిడి ఆకులు మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు లేత మామిడి ఆకులను నమిలి తిన్నా, లేదా మామిడి ఆకులను మరిగించి కషాయంలా తీసుకున్న మధుమేహం అదుపులో ఉంటుంది. మామిడి ఆకులలో ఉండే మాంగిఫెరిన్ యాంటీ మైక్రో బయల్ ఏజెంట్ గా పనిచేస్తుంది. ఇది రక్తంలోని చక్కర స్థాయిలను నియంత్రించడంలో ప్రభావంతంగా పనిచేస్తుంది. ఇక మామిడి ఆకులను నీళ్లలో వేసి మరిగించి ఆ నీటిని రాత్రంతా ఉంచి ఉదయాన్నే దాన్ని వడకట్టుకుని ఖాళీ కడుపుతో తాగితే మంచి ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. క్యాన్సర్ వంటి రోగాలకు, ఊబకాయం, గుండె జబ్బులు, జీర్ణ క్రియ, కొలెస్ట్రాల్ సమస్య పరిష్కారానికి మామిడి ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. మామిడి ఆకులు రక్తనాళాలను బలపరిచి రక్తపోటును నియంత్రించడంలో ఎంతగానో ఉపయోగపడతాయి. మామిడి ఆకుల టీ తయారుచేసుకుని తాగిన, మామిడాకులను మరిగించి ఆ నీటితో స్నానం చేసిన ఒత్తిడి కూడా తగ్గుతుందని చెబుతున్నారు. ఇక మామిడి ఆకులలో ఉండే యాంటీ కార్సినోజెనిక్ లక్షణాలు క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణమైన ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని నివారిస్తాయి. మామిడి ఆకులలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ బి మరియు ఫ్లేవనాయిడ్లు , శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కడుపు పూత చికిత్సలలో కూడా మామిడి ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. మామిడి ఆకుల్లో ఉండే ఫ్లేవనాయిడ్లు జుట్టుకు ఎంతో బాగా ఉపయోగపడతాయి. జుట్టు నెరిసిపోకుండా ఇవి కాపాడతాయి. ఇవి కొలాజిన్ ఉత్పత్తికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయి. మామిడి ఆకులతో టీ, ఆకులను మరిగిస్తే వచ్చే రసం, ఆకులను ఎండబెట్టి పొడిగా చేసుకుని కూడా వాడుకోవచ్చు.

# థైరాయిడ్ పేషెంట్లు తినాల్సిన సూపర్ ఫుడ్




గుమ్మడి గింజల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి, మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. గుమ్మడి గింజలు మనకు చాలా కాలం పాటు ఆకలిని తగ్గించి, బరువు తగ్గడానికి సహాయపడతాయి. గుమ్మడి గింజల్లో జింక్ అధికంగా ఉంటుంది. జింక్ థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి చాలా ముఖ్యమైన ఖనిజం. థైరాయిడ్ అనేది మెడ ముందుభాగంలో ఉన్న ఒక గ్రంథి. ఇది శరీరంలోని వివిధ ప్రక్రియలను నియంత్రించే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. అయితే థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పని చేయకపోవడం వల్ల అనేక వ్యాధులు వస్తాయి. థైరాయిడ్ నుంచి బయటపడాలి అనుకొనేవారు గుమ్మడి గింజలను తీసుకోవాలి. గుమ్మడి గింజలు అనేవి కేవలం రుచిని పెంచేవి మాత్రమే కాదు. ముఖ్యంగా థైరాయిడ్ సమస్యలతో బాధపడే వారికి ఇవి అద్భుతమైన మందు. గుమ్మడి గింజల్లో ఉండే మెగ్నీషియం, పొటాషియం హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. గుమ్మడి గింజలు దీర్ఘకాలిక వాపును తగ్గించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలు చాలా సందర్భాలలో దీర్ఘకాలిక వాపుతో సంబంధం కలిగి ఉంటాయి. ఈ చిన్న గింజల్లో ప్రోటీన్లు, ఫ్యాట్స్, ఫైబర్, విటమిన్స్, మినరల్స్ అధికంగా ఉంటాయి. థైరాయిడ్ గ్రంథి సక్రమంగా పనిచేయడానికి అయోడిన్ అవసరం. గుమ్మడి గింజలు అయోడిన్‌ను సమతౌల్యం చేయడంలో సహాయపడతాయి. గుమ్మడి గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. పురుషులలో ప్రోస్టేట్ సమస్యలను తగ్గించడంలో గుమ్మడి గింజలు ఉపయోగపడతాయి. రక్తపోటును నియంత్రించి, గుండె జబ్బులను తగ్గిస్తాయి. గుమ్మడి గింజలు చూడడానికి చిన్నవిగా అనిపించినా అందులో దాగి ఉన్న పోషక విలువలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుమ్మడి గింజల్లో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచి, మంచి నిద్రకు దోహదపడుతుంది.

# గుండె ఆరోగ్యానికి మేలు చేసే బ్రోకోలి




బ్రోకోలి చూసేందుకు కాలీఫ్లవర్ లాగా ఉంటుంది. ఆకుపచ్చగా ఉండే బ్రోకలీ కాలీఫ్లవర్ జాతిలో ఓ ప్రత్యేకమైన కూరగాయల రకం. గతంలో ఇవి విదేశాలలో మాత్రమే లభ్యమయ్యేవి.కానీ ప్రస్తుతం మన దేశంలో కూడా వీటిని పండిస్తున్నారు. ఈ కూరగాయ వివిధ రకాల విటమిన్లు, కాల్షియం, పొటాషియం వంటి ఖనిజాలతో నిండి ఉంటుంది. బ్రకోలీ తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం.. బ్రోకలీలో ఫైబర్, పొటాషియం, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇది హృదయ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనది. ఫైబర్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. పొటాషియం రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఒమేగా –3 కొవ్వు ఆమ్లాలు మంటను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడతాయి. బ్రోకలీలో గ్లూకోసినోలేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది శరీర నిర్విషీకరణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఈ సమ్మేళనం కాలేయం నిర్విషీకరణ ఎంజైమ్‌లను సక్రియం చేస్తుంది. ఇది టాక్సిన్స్, హానికరమైన పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. అలాగే బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కె, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఈ పదార్థాలన్నీ మొత్తం ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడుతాయి. కాల్షియం అనేది ఎముక కణజాలం ప్రాథమిక బిల్డింగ్ బ్లాక్. అయితే ఇందులోని విటమిన్ ఖ కాల్షియంను గ్రహించడంలో సహాయపడుతుంది. మెగ్నీషియం ఎముక సాంద్రతను పెంచుతుంది. బ్రోకలీలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. తద్వారా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులోని పదార్థాలు జీర్ణక్రియలో ముఖ్యమైన పాత్ర పోషించి, జీర్ణాశయంలో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను కూడా పెంచుతాయి. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. తక్కువ క్యాలరీలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల బ్రోకోలీ చాలా కాలం పాటు కడుపును నిండుగా ఉంచుతుంది. ఫలితంగా అతిగా తినే అవకాశం తగ్గుతుంది. బ్రోకలీలో లుటీన్, జియాక్సంతిన్ అనే పదార్ధులు ఉన్నాయి.

# మధుమేహం ఉన్నవారు పెరుగు తినడం మంచిదేనా?



ప్రస్తుతం ఎక్కువమంది ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల్లో డయాబెటిస్ ఒకటి. ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పులు కూడా ఇందుకు కారణం అవుతున్నాయి. అయితే మధుమేహం ఉన్నవారు పెరుగు తినవచ్చా? అనే సందేహాలు కూడా కొందరు వ్యక్తం చేస్తుంటారు. కాగా కొన్ని రకాల హెల్తీఫుడ్స్ ద్వారా కూడా దీనిని నివారించడం, అదుపులో ఉంచుకోవడం సాధ్యం అవుతుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా పెరుగు అందుకు సహాయపడుతుందని అమెరికన్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతిరోజూ కనీసం రెండు కప్పుల పెరుగు తినడంవల్ల టైప్ –2 డయాబెటిస్ రిస్క్ తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ న్యూట్రిషన్ పరిశోధకుల అధ్యయనంలోనూ ఇది వెల్లడైంది. అయితే బాదం, కొబ్బరిపాలు వంటి ఇతర పదార్థాలు కలిపిన పెరుగు కాకుండా, స్వచ్ఛమైన పాలతో తయారైన పెరుగు మాత్రమే ఇటువంటి ప్రయోజనాన్ని కలిగిస్తుందని చెప్తున్నారు. పెరుగులో అనేక పోషక గుణాలు ఉంటాయి. కార్బో హైడ్రేట్లు, గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి ఇన్సులిన్ సహాయం లేకుండా రక్తంలో షుగర్ లెవల్స్‌ను కంట్రోల్లో ఉంచగలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. అందుకే షుగర్ పేషెంట్లు నిస్సందేహంగా పెరుగు తినవచ్చు అంటున్నారు.

# వర్షాకాలంలో ఈ ఆహారాలు డీహైడ్రేట్ చేస్తాయ్



వర్షాకాలంలో చాలా మంది నీళ్లు తక్కువగా తాగుతుంటారు. దీనితో శరీరంలో డీహైడ్రేషన్ లేదా నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ సమస్య తీవ్రమైతే ఒక్కోసారి ప్రాణాంతక పరిస్థితులు కూడా సంభవిస్తుంటాయి. వర్షాకాలంలో డీహైడ్రేషన్ గురి కావడం వెనుక అసలు కారణం తెలుసుకోవాలంటే.. మీ రోజువారీ ఆహారంపై దృష్టి పెట్టాలి. నిర్జలీకరణాన్ని కలిగించే అనేక ఆహారాలు ఉన్నాయి. అవి ఏమిటంటే.. ఎనర్జీ డ్రింక్స్ – చాలా మంది జిమ్‌లకు వెళ్లేవారు రీహైడ్రేట్‌గా ఉండటానికి ఎనర్జీ డ్రింక్స్ తాగుతుంటారు. అయితే ఈ ఎనర్జీ డ్రింక్ తాగడం వల్ల డీహైడ్రేషన్ ఏర్పడుతుందని చాలా మందికి తెలియదు. ఎనర్జీ డ్రింక్స్‌లో చాలా చక్కెర ఉంటుంది. ఇది ప్రేగులపై ఒత్తిడిని కలిగిస్తుంది. శరీరంలో నీటి శాతాన్ని తగ్గిస్తుంది. దీని వల్ల డీహైడ్రేషన్ వస్తుంది. నిర్జలీకరణానికి మరొక కారణం అధిక ప్రోటీన్ ఆహారాలు. నిర్జలీకరణాన్ని నివారించడానికి కార్బోహైడ్రేట్, ప్రోటీన్ సమతుల్యంగా తీసుకోవాలి. నిమ్మరసం – బరువు తగ్గడానికి చాలా మంది ప్రతి రోజూ ఉదయం నిమ్మరసం తాగుతారు. నిమ్మరసం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రతిరోజూ పెద్ద మొత్తంలో నిమ్మరసం తాగడం వల్ల మూత్రం అధికంగా వెలువడుతుంది. ఫలితంగా తరచుగా మూత్రవిసర్జన చేయడం వల్ల శరీరంలోని నీరు పోతుంది. అందువల్ల డీహైడ్రేషన్ సమస్య తలెత్తవచ్చు. అలాగే ఎక్కువ కాఫీ తాగడం వల్ల కూడా తీవ్రమైన డీహైడ్రేషన్, తలనొప్పి, ఇతర సమస్యలు వస్తాయి. రోజుకు 110 మి.గ్రా కంటే ఎక్కువ కాఫీ తాగడం అస్సలు మంచిది కాదు. ఉప్పగా ఉండే ఆహారాలు – సోడియం అధికంగా ఉండే ఆహారాలు కూడా శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తాయి. ఎందుకంటే ఉప్పు శరీరం నుండి నీటిని త్వరగా గ్రహించి, నిర్జలీకరణం చేస్తుంది. డీప్ ఫ్రైడ్ ఫుడ్స్ – ఎక్కువగా వేయించిన ఆహారాలు తినడం వల్ల దాహం వేస్తుంది. ఎక్కువగా వేయించిన ఆహారం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. అటువంటి ఆహారం తీవ్రమైన నిర్జలీకరణానికి దారితీస్తుంది.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110